క్లుప్తంగా

భూంపల్లి ఎస్ఐగా భువనేశ్వర్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి ఎస్ఐగా వి.భువనేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేసిన ఆయన భూంపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన గంగరాజు దుబ్బాకకు బదిలీ అయ్యారు.

దుబ్బాక ఎస్సైగా గంగరాజు

దుబ్బాక: దుబ్బాక ఎస్సైగా గంగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన బత్తుల మహేందర్ సీఐగా పదోన్నతి పొంది హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో భూంపల్లి ఎస్సైగా పని చేసిన గంగరాజు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ.. మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు పార్టీల కతీతంగా అందరూ సహకరించాలని కోరారు.

నిరాశ్రయులకు భోజన వసతి



భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

హుస్నాబాద్: పట్టణంలో భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులు, శిథిల ఇళ్లల్లో ఉంటున్న నిరాశ్రయులను పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. 11వ వార్డుకు చెందిన ఓ కుటుంబాన్ని పురావాస కేంద్రానికి తరలించి భోజనం, తాగునీటి వసతిని కల్పించారు. వర్షం తగ్గేవరకు పునరావాస కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, కమిషనర్ రాజశేఖర్ తెలిపారు.

డ్రైనేజీలో పడిన వ్యక్తిని కాపాడిన మున్సిపల్ మాజీ చైర్మన్




రక్షించిన అనంతరం అతనితో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిన వ్యక్తిని మున్సిపల్ మాజీ చైర్మన్ సురక్షితంగా బయటకు తీశాడు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ సమీపంలోని ఓ టీ స్టాల్ వద్ద పట్టణానికి చెందిన లింగం టీ తాగుతున్నాడు. లింగం నిలబడి ఉన్న బండ ఆకస్మాత్తుగా పగిలిపోవడంతో అతడు డ్రైనేజీలో పడిపోయాడు. సుమారు 60 మీటర్ల వరకు కొట్టుకుపోయాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో పరిసరాలను పరిశీలిస్తున్న సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు స్పందించి స్థానికులతో కలిసి లింగంను రక్షించాడు. అతడిని క్షేమంగా ఇంటి వద్ద వదిలిపెట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించాడు. తనను కాపాడిన రాజనర్సుకు ఆ వ్యక్తి కృతజ్ఞతలు తెలిపాడు.

ఆర్థికసాయం

ములుగు(గజ్వేల్): మండలంలోని బండ తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ కార్యకర్త వరప్రసాద్ కుటుంబీకులను మండల బీజేపీ అధ్యక్షుడు రమేశ్‌యాదవ్ గురువారం పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



డ్రైనేజీలో చెత్తను తొలగింపజేస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని సిబ్బందితో తొలగింపజేశారు. చెరువులు అలుగులు పారుతుండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలతో ప్రయోజనం

సిద్దిపేటకమాన్: కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి మోదీ వర్చువల్ మీటింగ్‌ను పట్టణంలోని ఓ ట్రేడర్స్ దుకాణంలో గురువారం బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ కిసాన్ కేంద్రాలను ఆవిష్కరించి జాతికి అంకితం చేయడం దేశానికి గర్వకారణం అన్నారు. రైతు శ్రేయస్సే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం అన్నారు.

ముంచెత్తిన వాన

- పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు
- నీట మునిగిన పంటపొలాలు
- నిలిచిన రాకపోకలు
- పలుచోట్ల కూలిన శిథిల ఇళ్లు



హుస్నాబాద్: మెయిన్ రోడ్‌ను ముంచెత్తిన వర్షం నీరు

దుబ్బాకటౌన్: భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు దుబ్బాక పట్టణంతో పాటుగా మండలంలో వాన దంచికొట్టడంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీల్లో వరదనీరు నిండి చాలా ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. పలు ఇళ్లు, పాత గోడలు కూలిపోయాయి. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే వాగుపై ఉన్న 28 చెక్‌డ్యామ్‌లు నిండడంతో పాటు పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతుండడంతో కూడవెల్లి వాగు పోటెత్తింది. వరదనీరు పొలాల్లో చేరి మునిగిపోయాయి.

విద్యుత్ సబ్‌స్టేషన్ జలమయం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల చెరువులు, కుంటలు అలుగు పారుతుండగా చెరువుల్లో చేపలు పట్టేందుకు యువకులు పోటీపడ్డారు. పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ జలమయమవగా, కాలనీల్లోని రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. పట్టణంలోని పాండవుల చెరువు వద్ద పలువురికి భారీ చేపలు లభించాయి. ఇదిలా ఉంటే మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌తో పాటు చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌లు వార్డుల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు.

జలదిగ్బంధంలో హుస్నాబాద్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణం జలదిబ్బంధంలో చిక్కుకుంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏ రోడ్డుపై చూసినా వరద నీటి ప్రవాహం ఉరకలెత్తింది. హుస్నాబాద్ పట్టణంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన రహదారులు నడుములోతు వరకు నీటి ప్రవాహం నిలిచిపోయింది. కాలు పెట్టి కాలు తీయలేని పరిస్థితిలో వరద నీటి ప్రవాహంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. మురికి కాల్వలు ఉప్పొంగడంతో రహదారులపై నిలిచిపోవడంతో పలు దుకాణాలు, ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో వాటిని ఎత్తిపోయలేక నానా అగచాట్లు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆటోస్టాండ్ నీటి వలయంలో తెలియాడుతోంది.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువుతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల ఊర చెరువులు మత్తడి దూకాయి. పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ నీటిమయం కాగా గాంధీ కూడలీ వద్ద రోడ్డుపైనుంచి ప్రవహించిన వరదనీరు, ఆ ప్రాంతంలోని సెల్లార్లలోకి చేరింది. దీంతో గాంధీ కూడలీ ప్రాంతం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. మండల పరిధిలోని వీరన్నపేట గ్రామ శివారులో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్త కల్వర్టు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన డైవర్షన్ తెగడంతో జనగామ–సిద్దిపేట రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులు మత్తడి పడడం, వరద నీరు వచ్చి చేరడంతో పంట పొలాలు నీట మునిగాయి.

ఐదు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండలం గుండా పారే మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాగవతలి గ్రామాలైన ఖాత, కొండంరాజ్‌పల్లి, ఘణపూర్, గట్లమల్యాల, అక్కేనపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు జలదిగ్బంలో చిక్కుకోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి.

గూడు చెదిరే.. గోడు మిగిలే

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లో పాత ఇళ్లు కూలిపోయాయి. తిగుల్ గ్రామానికి చెందిన కొడిగుడ్ల ఐలయ్య, గిరిపల్లి మల్లయ్య, అలిరాజ్‌పేట గ్రామానికి చెందిన ఎర్ర యాదగిరి, బీజీవెంకటాపూర్ గ్రామానికి చెందిన పోకల భాస్కర్ ఇళ్లు కూలిపోయాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు మంజుల రమేశ్, లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, భానుప్రకాశ్‌రావులు బాధితులను పరామర్శించారు. అలిరాజ్‌పేటలో యాదగిరికి సర్పంచ్, ఎంపీటీసీ వేర్వేరుగా పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని కపూర్‌నాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో సుమారుగా 6 ఇళ్లు కూలిపోయాయి.



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో సెల్లార్లలోకి చేరిన వరద నీరు



చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులో పంట పొలాల్లోకి చేరిన వరద నీరు



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి క్రాసింగ్ వద్ద గల కల్వర్టుపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



అక్కన్నపేట(హుస్నాబాద్): రామవరంలో నీట మునిగిన వరి పంట పొలాలు



దుబ్బాకటౌన్: దుబ్బాకలో నీటమునిగిన వరిపొలాలు



చిన్నకోడూరు(సిద్దిపేట): రామునిపట్ల–గోనెపల్లి మధ్య ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న అధికారులు



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో నీట మునిగిన వరి పంటలు



జగదేవ్‌పూర్(గజ్వేల్): బీజీవెంకటాపూర్‌లో కూలిన ఇల్లు



హుస్నాబాద్: మత్తడి వద్ద చేపలు పడుతున్న మత్స్యకారులు



మద్దూరు(హుస్నాబాద్): ఇంట్లోకి వచ్చిన నీటికి ఎత్తిపోస్తున్న మహిళ



హుస్నాబాద్: నీటి వలయంలో బస్టాండ్



గజ్వేల్‌రూరల్: జలమయమైన విద్యుత్ సబ్‌స్టేషన్



హుస్నాబాద్: నీటిని ఎత్తిపోస్తున్న దుకాణదారులు



నంగునూరు(సిద్దిపేట): చేపలు పడుతున్న జాలరులు



వర్గల్(గజ్వేల్): సీతారాంపల్లిలో కూలిన ఇల్లు

అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలి

సిద్దిపేట సీపీ శ్వేత



కూడవెల్లి వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ శ్వేత సూచించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ.. వర్షాలతో జిల్లాలో చెరువులు, వాగులు నిండుకుండలా ఉధృతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. చేపల వేట, ఈత, సెల్ఫీల పేరుతో నీటి దగ్గరకు వెళ్లి ప్రమాదాల బారిన పడకూడదని తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్టాపర్స్ ఏర్పాటు చేసి పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఎమైనా సమస్య వస్తే డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం 8712667100 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. చేర్యాల నుంచి జనగాం వెళ్లేవారు చుంచనకోట, బచ్చనపేట మీదుగా వెళ్లాలని సూచించారు. దుబ్బాక నుంచి బీబీపేట వెళ్లేవారు భూంపల్లి, చిన్ననిజాంపేట, రాంపూర్ తుజల్‌పూర్ మీదుగా బీబీపేట వెళ్లాలని తెలిపారు. అందె, అల్వాల్ వెళ్లే వారు మిరుదొడ్డి గ్రామం మీదుగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ డైవెర్షన్ చేసిన ప్రాంతాల్లో వాహనదారులు పోలీసుల సలహాలు, సూచనలు పాటించి వెళ్లాలని సీపీ తెలిపారు. అందె, అల్వాల్ గ్రామాల మధ్య ఉన్న ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగును సీపీ శ్వేత పరిశీలించారు. ఆమె వెంట ఎస్ఐ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పరిధిలోని నాగపురి గ్రామ అబ్దుల్ కలాం సేవా సంస్థ ఉపాధ్యక్షుడు గడ్డల మహిపాల్, ప్రధాన కార్యదర్శి బండమీది కరుణాకర్ అన్నారు. గురువారం సంస్థ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రజ్ఞాపూర్ ఎల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ కుందారపు రాములు, సంస్థ ప్రతినిధులు గూడెపు మహేశ్, నాగపురి సత్యనారాయణ, నర్సింహులు, వెంకటేశం పాల్గొన్నారు.

కోహెడ(హుస్నాబాద్): మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పీవీ నర్సింహారావు సేవా సమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వెల్పుల శంకర్, బందెల బాలలకిషన్, ప్రకాశ్‌గౌడ్, మనోహర్, శ్రీనివాస్, బాబయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువు పరిశీలన

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి ఉధృతిని గురువారం ఏసీపీ సతీశ్, తహసీల్దార్ ఉన్నీసా బేగంలు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ.. ఎల్లమ్మ చెరువు మత్తడి ఉధృతంగా ప్రవహిస్తుందని, వరదను చూసేందుకు ఎవరిని అనుమతించొద్దని సూచించారు. అదేవిధంగా మత్స్యకారులను సైతం చేపలు పట్టేందుకు అనుమతివ్వొద్దని అధికారులకు సూచించారు. చెరువులు, వాగుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సీఐ కిరణ్, ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు మత్తడి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీశ్

ఘనంగా మొహర్రం



సిద్దన్నపేటలో పీర్లతో ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

నంగునూరు(సిద్దిపేట): మొహర్రం పురస్కరించుకొని గురువారం ఏడోరోజు పెద్ద ఎత్తున వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సిద్దన్నపేట, ఘణపూర్, పాలమాకుల, రాంపూర్, రాజగోపాల్‌పేట, మగ్దుంపూర్ గ్రామాల్లో పీర్లతో ఊరేగింపు నిర్వహించగా భక్తులు కొబ్బరి, బెల్లం, దట్టీలు కట్టి మొక్కలు తీర్చుకున్నారు.

నాచగిరి హల్దీ వద్ద అప్రమత్తంగా ఉండాలి



పోలీసులకు సూచనలు ఇస్తున్న రూరల్ సీఐ జానకీరాంరెడ్డి

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచారం గుట్ట పుణ్యక్షేత్రం వద్ద హల్దీ ప్రవాహ ఉధృతి దృష్ట్యా నాచగిరి చెక్‌పోస్టు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ రూరల్ సీఐ జానకీరాంరెడ్డి సూచించారు. గురువారం హల్దీవాగు చెక్‌డ్యాం వద్ద వరద ఉధృతి తీరు పరిశీలించారు. యాత్రికుల సందర్శన ప్రదేశం కావడంతో తమ సిబ్బందికి పలు సూచనలు చేశారు. యాత్రికులు, గ్రామస్తులు హల్దీ చెక్‌డ్యాం, బ్రిడ్జివైపు స్నానాలకు వెళ్లొద్దన్నారు. వరద తీవ్రత దృష్ట్యా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ విషయంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

రామసముద్రం మత్తడి వద్ద రెస్క్యూ ఆపరేషన్

రోడ్డుపై పేరుకుపోయిన చెత్త తొలగింపు



చెత్తను తొలగింపజేస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: భారీ వర్షాలతో దుబ్బాక పట్టణంలోని రామసముద్రం చెరువు ఉధృతంగా అలుగుపోస్తుంది. అలుగు నీటితో పాటు పెద్ద ఎత్తున చెత్త, చెదారం కొట్టుకువచ్చి దుబ్బాక–సిద్దిపేట ప్రధాన రహదారిపై చెట్లకు తట్టుకొని ఆగింది. దీంతో ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు కంటే ఎక్కువగా రామసముద్రం అలుగు నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇది గమనించిన మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మూర్తి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు జేసీబీ, డోజర్ సాయంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి వరదలో పెద్ద ఎత్తున తట్టుకున్న చెత్తను తొలగించి రోడ్డుపై నీరు నిల్వకుండా చేశారు. ఇబ్బందులను తొలగించేందుకు చేపట్టిన చర్యలపై కమిషనర్ గణేశ్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



మెయిన్ రోడ్‌లో వరద నీటి పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, తదితరులు

హుస్నాబాద్: పట్టణంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎల్లమ్మ చెరువు మత్తడి, మెయిన్ రోడ్‌లో వరదనీరు చేరిన పలు దుకాణాల నివాసాలు, పలు వార్డుల్లో కూలిన ఇళ్లు, శిథిల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలమైన ఇళ్లల్లో ఉండొద్దని, ఏదైనా సమస్య ఎదురైతే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు సమాచారం ఇస్తే వెంటనే మున్సిపల్ సిబ్బంది సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అవసరమైన వారికి సేవలు అందిస్తామని చైర్‌పర్సన్ రజిత తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ వెంకట్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

గంగమ్మకు పూజలు

ములుగు(గజ్వేల్): చెరువుల నీటితో ఆయకట్టు భూముల్లో రైతులు పంటలు పండించుకోవడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని ములుగు మండల జెడ్పీటీసీ నర్సంపల్లి జయమ్మఅర్జున్‌గౌడ్ అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గల అజీమ్ చెరువు వర్షాలకు నిండి పొంగిపొర్లుతుండటంతో గురువారం చెరువు వద్ద స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి గంగమ్మకు చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు పునరుద్ధరణ పనులు పూర్తి చేయడంతో వర్షాలకు చెరువు నిండి జలకళను సంతరించుకుందన్నారు. అంతే కాకుండా చెరువుకింద ఉన్న వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లమ్మలింగం, ఉపసర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



చెరువు వద్ద పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ జయమ్మ

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన 77 మంది యువతీ, యువకులకు గజ్వేల్ పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్సులను గురువారం మాదాసు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు నిజామొద్దీన్, కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పాతూరులో పొలంబడి

మర్కూక్(గజ్వేల్): కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం వారి ఆధ్వర్యంలో పాతూరు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ అధికారి సునిత మాట్లాడుతూ.. కూరగాయల పంటల్లో శుద్ధి పద్ధతిని రైతులకు వివరించారు. సస్యరక్షణ పద్ధతుల్లో తక్కువ ఖర్చులో అధిక దిగుబడి ఎలా సాధించాలో రైతులకు వివరించారు. పొలం బడి కార్యక్రమం 14 వారాల పాటు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు శ్వేత, సుధ, సౌమ్య, ఏఈఓ రజనీకాంత్, సర్పంచ్ అరుణానర్సింలు రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు